సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా మండలంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి, పవన్‌చందు తెలిపారు. రావల్‌కోల్ సబ్ స్టేషన్ పరిధిలో రావల్‌కోల్‌తో పాటు గ్రామ పరిధిలోని అన్ని డొమెస్టిక్, అగ్రికల్చర్, పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అదేవిధంగా మేడ్చల్ ఐడీఏలోని పరిశ్రమలకు, చెక్ పోస్ట్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

12, 13న జాతీయ సమ్మేళనం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఓయూ ఉపకులపతి రవీందర్

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో గల కేజీఆర్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం వారితో కలిసి సంయుక్తంగా ఏప్రిల్ 12, 13న కేజీఆర్ కళాశాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యకాలిక, పరిశ్రమల సమస్యలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సమ్మేళనంకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఓయూ వైస్ ఛాన్స్‌లర్ డి.రవీందర్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఓఎస్‌డీ రెడ్యానాయక్‌లు విడుదల చేశారు. ఓయూ ఉపకులపతి రవిందర్ మాట్లాడుతూ.. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్వర్ణోత్సవాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సమ్మేళనానికి కేజీఆర్ కళాశాల ముందుకు వచ్చినందుకు అభినందించారు. ఇలాంటి మరో 50 కార్యక్రమాలను, వివిధ సంస్థలు విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలకు చెందిన 50 మంది ప్రముఖుల ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె.గోవిందరెడ్డి, డైరెక్టర్ పీవీ రమణారావు, ప్రిన్సిపాల్ ఎస్.విజయలక్ష్మీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డి.శ్రీరాములు, పి.వెంటకయ్య, బీఓఎస్ చైర్మన్ వి.సుధ పాల్గొన్నారు.

రేపటి నుంచి కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆర్టీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ ఆలయం

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న విగ్రహ ఊరేగింపు, శోభాయాత్ర, 23న మహాగణపతిపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, దీక్షాధారణ, 24న మండప పూజ, చండీ సప్తశతి, ప్రతిష్ఠా హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజు బోనాల సమర్పణ ఉంటుందని, పట్టణ ప్రజలు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు సంస్కృతి టౌన్‌షిప్‌లో కంటి వెలుగు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు నిమ్స్ బిల్డింగ్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభమవుతుందని కౌన్సిలర్ హరిప్రసాదరావు తెలిపారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు రెండ్రోజుల పాటు కొనసాగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నారసింహుడిని దర్శించుకున్న ఎంపీపీ

ఘట్‌కేసర్: పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో విడిది చేసిన శ్రీలక్ష్మీనర్సింహ స్వామి అఖండ జ్యోతి రథం సోమవారం ఉదయం యాదాద్రికి బయల్దేరింది. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సీనగర్, అవుషాపూర్‌లో భక్తులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, మచ్చేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్‌రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ ఎస్ఐ మురళీధర్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కమలాకర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మురళీధర్

విద్యార్థుల సన్నద్ధత పదిలమేనా?



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైంది. తొలిసారి బోర్డు పరీక్షలను ఎదుర్కోవాల్సి రావడంతో విద్యార్థులు అదే స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్నత చదువులతో పాటు భవిష్యత్తులోనూ పదో తరగతి మార్కులను ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన తరుణంలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పదో తరగతి విద్యార్థుల చదువులపై ప్రభావం చూపేలా ఉంది. కాగా మరో 45 రోజుల్లో వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- తొలిసారి బోర్డు పరీక్షతో విద్యార్థులపై ఒత్తిడి
- విద్యా సంవత్సరం ముగింపు దశలో టీచర్ల బదిలీ ప్రక్రియతో పెను ప్రభావం
- 45 రోజుల్లో వార్షిక పరీక్ష ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1.54 లక్షల విద్యార్థులు

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 1.54 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం తుది దశకు చేరుకుంది. ఈ దశలో అనూహ్యంగా బదిలీల షెడ్యూలు విడుదల కావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

విద్యార్థులకు శాపంగా బదిలీ ప్రక్రియ...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1863 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. 317 జీవో ద్వారా వచ్చిన వారికి అవకాశం కల్పించడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే బదిలీల పర్వం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఉంది. ఈ అంశాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 27 నుంచి బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ అమలోకి వచ్చింది. మారిన షెడ్యూల్ ప్రకారం.. ఈ ప్రక్రియ మార్చి మాసాంతం వరకు కొనసాగనుంది. ఇంకో పక్క విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుతో పాటు పదో తరగతి వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విద్యార్థులకు భారంగా మారనుంది. బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉన్నా దరఖాస్తు చేసేందుకు, ధ్రువపత్రాల పరిశీలన, అభ్యంతరాల పేరిట పలుమార్లు జిల్లా కేంద్రానికి వారు తిరగాల్సి రావడం సమస్యగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆగిన బోధనోపకరణాల మేళా...

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించి సిలబస్ చాలా చోట్ల ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పునఃశ్చరణ చేపట్టాల్సిన తరుణంలో ఉపాధ్యాయుల బదిలీపై శ్రద్ధ పెడితే పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన మెలకులపై పట్టు తప్పే పరిస్థితి ఉంది. ప్రత్యేక తరగతులతో పాటు వెనకబడిన విద్యార్థులపై ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి శ్రద్ధ తీసుకోవాలి. ఇంకో పక్క తొలిమెట్టులో భాగంగా ఉపాధ్యాయుల బోధనకు పదును పెట్టేలా వారి ప్రతిభను వెలికి తీసేందుకు ప్రవేశపెట్టిన బోధనోపకరణాల మేళా బదిలీల షెడ్యూల్ కారణంగా ఆగిపోయింది. మండల స్థాయిలో మేళా విజయవంతమైంది.

ఆన్‌లైన్ ద్వారానే ప్రక్రియ పూర్తి చేయాలి

ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారానే పూర్తి చేయాలని ఆదేశించాం. పదో తరగతి విద్యార్థులపై ఈ ప్రభావం ఉండదు. దరఖాస్తులకు సంబంధించి కూడా పాఠశాల పని వేళలు ముగిసిన తర్వాతే కార్యాలయానికి రావాలని సూచించాం. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ముందుకు సాగుతున్నాం.

– ఐ.విజయకుమారి, జిల్లా డీఈఓ

కనుల పండువగా మల్లన్న కల్యాణోత్సవం



మల్లన్న కల్యాణోత్సవంలో మంత్రి మల్లారెడ్డి



స్వామివారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన ఒగ్గు పూజారులు అనంతరం స్వామివారి కల్యాణంను ఘనంగా జరిపించారు. సాయంత్రం స్వామివారికి మహిళలు బోనాలు సమర్పించారు. అనంతరం అగ్ని గుండాలు, జాతర మహోత్సవం నిర్వహించారు.

మంత్రి ప్రత్యేక పూజలు...

మల్లన్న కల్యాణోత్సవంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, టీపీసీసీ నాయకులు వజ్రేశ్ యాదవ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొని పూజలు చేశారు. కల్యాణం సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

‘నన్ను అగౌరవ పరిచేందుకే ఆరోపణలు చేస్తున్నారు’



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేష్‌గౌడ్

ఘట్‌కేసర్: అగౌరవపరచాలని వార్డు సభ్యులు తనపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. కొర్రెముల్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పత్రిక సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ.. గతేడాది నుంచి పంచాయతీలో నిధులు లేక, ఉన్న అరకొర నిధులు నెల నెల కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయన్నారు. నిధులు లేక నేటి వరకు సొంత నిధులు రూ.25 లక్షలు వెచ్చించి ఒక్క చెక్కు కూడా డ్రా చేసుకోలేదన్నారు. పాలకవర్గ సభ్యుల తీర్మానం మేరకు గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, గ్రామ పంచాయతీ నిర్వాహణకు చేసిన వ్యయం గురించి పాలకవర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపుతామని గుర్తు చేశారు. అవాస్తవ ఆరోపణలు మానుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

కంటి వెలుగుతో పేదలకు మేలు

ఘట్‌కేసర్: కంటి సమస్యతో డబ్బులు లేక, ఆస్పత్రులకు వెళ్లలేని స్థితిలో బాధపడుతున్న పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు ఎంతో మేలును చేకూరుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ 8వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, హేమలత గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ విమల, ఆప్తమాలిజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, వైద్యసిబ్బంది విజయ, రాజేశ్వరీ, మేఘమాల పాల్గొన్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

అంగన్‌వాడీ సమస్యలపై ఎంపీపీకి వినతి



ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఘట్‌కేసర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. బీఎల్‌ఓ విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార భోజనం, సరుకులు ఇంటికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, స్థానిక ఏజెన్సీలకు అప్పగిస్తూ రెండు సిలిండర్లు ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల విద్యుత్ బకాయిలు మాఫీ చేసి ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని, కూరగాయల బిల్లులు పెంచి నెలనెలా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని టీచర్లు సుచిత్ర, వైశాలి తదితరులు ఎంపీపీకి వినతి అందజేశారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు జెడ్పీటీసీ శైలజ, సర్పంచ్ విజయానంద్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. గ్రామంలో టోర్నమెంట్ నిర్వహించగా 10 జట్లు తలపడగా పవర్ హిట్టర్స్ జట్టు ఫైనల్‌లో విజేతగా నిలవడంతో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రకాష్, నాయకులు యాదయ్య, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలి



సమావేశంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మై ఛాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీన్ లైఫ్ వారు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమావేశానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, బాల్యవివాహాలు, వాటి అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ శోభారాణి, ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ మంగులేశ్, క్రాంతి, గ్రీన్ లైఫ్ కోఆర్డినేటర్ వంశీ, వెంకట్, జీవిత, న్యాయవాధి విజయరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్య, సక్కుబాయి, టీచర్లు సుచిత్ర. వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ ఫెస్టివల్–2023



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీలో గల హాస్ స్పోర్ట్స్ అకాడమీలో పీఎస్ స్టార్స్ సంస్థ సహకారంతో ఆర్గనైజర్ టోనిగ్రిగ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఫుట్‌బాల్ ఫెస్టివల్–2023 సోమవారం ముగిసింది. ఈ టోర్నిలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి 16 జట్లు 130 మంది పాల్గొన్నారు. అండర్–12 జట్లలో విజయ హైస్కూల్ (కాప్రా), అండర్–15లో టోని 5 (తిరుమలగిరి) టీమ్‌లు ప్రథమ విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిలుగా పీస్‌స్టార్స్ సంస్థ ఫౌండర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ చిరంజీవి, రాయడెన్‌రోచే, జాన్‌పాల్, శారామాధురి, కోచ్‌లు మోహన్, డెంజిల్ తదితరులు పాల్గొని విజేత టీమ్‌లకు బహుమతులు అందజేశారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మేడ్చల్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మండలంలో సోమవారం సాగింది. తపస్ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులతో కలిసి అత్వెల్లి, మేడ్చల్, గౌడవెల్లి, గిర్మాపూర్, డబీల్‌పూర్, రాజబొల్లారం, రావల్‌కోల్ పాఠశాలలకు వెళ్లి టీచర్లకు ప్రచారం చేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు నవాత్ సురేష్, పద్మ, నవీన్, శ్రీధర్, రాజ్‌కుమార్‌యాదవ్, గోపాల్‌నాయక్, రమాదేవి, హనిమిరెడ్డి, బీజేపీ నాయకులు ప్రేందాస్, జగన్‌గౌడ్ ఉన్నారు.

ప్రజావాణిలో 47 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 47 ఫిర్యాదులు స్వీకరించినట్లు మేడ్చల్–మల్కాజిగిరి అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి సమావేశ హాలు లో డీఆర్‌ఓ లింగ్యానాయక్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సెయింట్ పీటర్స్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ క్లబ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్ నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలతలు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అసాం రాజేశ్, ఏఓ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈటలను సన్మానించిన బీసీ ఫెడరేషన్ సభ్యులు



ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు తదితరులు

మేడ్చల్‌రూరల్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను సోమవారం బీసీ ఫెడరేషన్ కులాల సమితి నాయకులు సన్మానించారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఫెడరేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, నాయకులు అసెంబ్లీలో ఫెడరేషన్ల గూర్చి ప్రసావించినందుకు ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు శంకర్, శివరాం, తాళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

- 6 బైకులు, 3 ఆటోలు, సెల్‌ఫోన్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: సులభంగా డబ్బు సంపాదించాలని భావించిన ముగ్గురు వ్యక్తులు వాహనాల దొంగతనాలకు పాల్పడి చివరకు కటకటాలపాలయ్యారు. మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం... జగద్గిరిగుట్టకు చెందిన (ఏ1) షేక్ ఇక్బాల్ అలియాస్ సోనూ(22) వృత్తి రీత్యా డ్రైవర్, అదే ప్రాంతానికి చెందిన (ఏ2) వడ్ల రవికుమార్(19) సెంట్రింగ్ పనితో పాటు ఖాళీ సమయాల్లో ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఎల్బీనగర్‌లో ఓ హోటల్ వంట మనిషిగా పనిచేస్తున్న (ఏ3) బెల్లంకొండ శివనాగ మహేశ్వర్‌రావు(22) ముగ్గురు మిత్రులు కావడంతో కలిసి మద్యం సేవించే వారు. సులభంగా డబ్బు సంపాదించాలని ముగ్గురు భావించారు. దీంతో షేక్ ఇక్బాల్ వాహనాల దొంగతనాలు చేసి వాటిని అమ్మి డబ్బులు పంచుకుందామని మిగతా ఇద్దరికి తెలుపగా వారు కూడా అంగీకరించడంతో దొంగతనాలకు ప్లాన్ చేసుకున్నారు. వచ్చిన డబ్బుతో మద్యం తాగి తమ సరదాలు తీర్చుకునే వారు. ఇందులో భాగంగా సైబరాబాద్, సంగారెడ్డి, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని పలు చోట్ల ద్విచక్రవాహనాలు, ప్యాసింజర్ ఆటోలను దొంగిలించి వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. కాగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి సుతారిగూడ వద్ద అనుమానస్పదంగా సంచరిస్తుండగా వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి రూ.11.20 లక్షల విలువైన ఆరు బైక్‌లు, మూడు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న మేడ్చల్ పోలీసులను ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు నర్సింహ, శంకర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



గణేష్

జవహర్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్లపు గణేష్, ఆదిలక్ష్మీలు దమ్మాయిగూడ శివానందపురి కాలనీలో నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన గణేష్ పని మీద యాదగిరిగుట్టకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ప్రాంతంలో...



అజిత్ బారిక్

భార్య సబితా పోతిన్, కుమార్తెతో కలిసి అజిత్ బారిక్ అనే వ్యక్తి బాలాజీనగర్ మార్కెట్ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12వ తేదీ అతడు పని నిమిత్తం బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేస్తున్న ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు – కీసర



స్వామివారి రథోత్సవం